# స్వానుభవం

## 1

"ఏం రా, బాబూ? అంతాకులాసా?" అన్నాను చదువుతూన్న వార్తాపత్రిక మడిచి బల్లమీద పెట్టి.

బాబు కుర్చీ నాకు దగ్గిరగా ఈడ్చుకుని కూర్చుంటూ "ఆ" అన్నాడు.

"కమలం కులాసా? దాన్ని కూడా తీసుకురాక పోయినావూ? ఎప్పుడో పెళ్ళికి చూడటం! సంసారం రుచిస్తున్నదా? బ్రహ్మ చర్యమే బాగుందనిపిస్తున్నదా?"

బాబు పరధ్యానంగా నా ప్రశ్నలను తోసేసి "ఒక్క మాటడగుతాను చెప్పు, బాబాయి!" అన్నాడు.

"అడుగు."

బాబుకు బుద్ధి తెలిసినప్పటినుంచీ నేనే తల్లీ తండ్రీనూ. ఇంతకాలం నేను వాడికి పినతండ్రి మోస్తరుగాలేను. మేమిద్దరం స్నేహితులంగా ఉంటూ వచ్చాం. ఒక్క అనుభవంలో తప్ప తతిమ్మా విషయాలన్నిట్లో మేమిద్దరం సమానంగా ఉండేవారం. ఉద్యోగం వచ్చినప్పటి నించీ వాడు నా దగ్గిర ఉండటం పడ్డది కాదు. ఇప్పుడు భార్య కూడా వచ్చింది. ఎంతోకాలం కాలేదు; నెల రోజులైంది.

వాడు ప్రశ్నలు వెయ్యటం నేను తోచినట్టు సమాధానాలు చెప్పటం మొదటినుంచీ ఉన్నదే.

"అతిగా భార్యాభ్రమలవాణ్ణేమంటాం?" అది వాడి ప్రశ్న.

నేను ఆలోచించి "కొత్తగా సంసారంలో దిగిన వాడియందు అది మంచి చిహ్నమనే చెప్పాలి" అన్నాను.

"కాదు! కాదు! భార్యను వదలి ఒక్కక్షణం ఉండలేడనుకో! ఒక్క క్షణం భార్య అవతలికిపోతే ఊపిరాడదనుకో!"

"అంత అన్యాయంగా ఉందా?" అన్నాను.

"చెబితే నమ్మవు! నేను బాగా ఆలోచించాను, బాబాయి! నాకు నీమీద ప్రేమలేదా? నిన్ను వదిలి ఉండలేదా?"

"అయితే ఇప్పుడు దాన్ని వదిలి ఉండలేదా?"

"ఉన్నాను! కాని...." బాబు కొద్దిగా తికమక పడ్డాడు. భావాన్ని తెలియ చెయ్యటానికి. "ఒక్కొక్క సమయంలో నన్ను నేను విమర్శించుకోగలను. అటువంటి సమయంలో నన్ను, నా భయాన్ని, భ్రమను చూస్తే నాకు చాలా ఎగతాళిగా ఉంటుంది. కాని ఇప్పుడు ఒంటరిగా కూర్చుని ఒక్క నిమిషం దాని సంగతి ఆలోచిస్తే ఇక్కడ నాకు ఒక్క క్షణం ఉండబుద్ధికాదు. నేనీవూరు వద్దామని ఎన్ని రోజులనించీ ప్రయత్నం! ఇక ఒకరోజు కూడా ఆలస్యం చేసేటందుకు వీలులేక వచ్చానన్నమాట!"

"ఆ! దానికేమిటి? అది కూడా దిక్కులేని పిల్ల కావటం చేత దాని బాధ్యత అంతా నీదే కనక నీకు దాని విషయం అంత శ్రద్ధ ఉండటం తప్పులేదు" అని తేల్చేశాను. కాని బాబు మాత్రం వంగలేదు.

"భగవంతుడున్నాడనే నమ్మకం మీద నా కష్టసుఖాలు కూడా నేనెన్నడూ లెక్క చెయ్యలేదు. నా భార్య విషయం వచ్చేసరికి నాకు ఆ భగవంతుడి యందు నమ్మకం ఏమయిపోతుందో! మొన్న ఒకరాత్రి అది బావిదగ్గరికి పోయింది, బాబాయి! నేనేదో చదువుకుంటూ కూడా తోడుపోదామని సగం లేచాను. నాకే అసహ్యం వేసింది. ఏమిటీపిచ్చి అనిపించింది. వెళ్ళలేదు. చదవటం మొదలుపెట్టాను. నాకొక్క ముక్క అర్థమైతేనా? ఇట్లా చదవాలని ఒక్క నిమిషం ప్రయత్నం చేశానేమో! నాకా ఒక్క నిమిషం పదినిమిషాల మాదిరిగా ఉంది. చీకట్లో పురుగూ పుట్రా ఉంటుందని భయం ! దొడ్లో ఏ దొంగాడైనా దాగున్నాడని భయం! ఎన్నడూ ఏ భయం ఎరగను! ఈ కొద్దిరోజుల్లో నేను పిరికి వెధవనైపోయినాను. బాబాయీ లేచి వెళ్ళకపోతే ఇంకా పాడు ఆలోచనలు వచ్చేటట్టు కనిపించింది. వెంటనే లేచి బావి దగ్గరికి వెళ్ళాననుకో! ఏమంటావు!" బాబు దీనంగా నవ్వాడు.

నాకీ సంగతి చెప్పి నాచేత కోప్పడించుకోవాలని బాబు ప్రయత్నం, నేనాపని చేసేదాకా వాడికి తృప్తి ఉండదు. నేను కొద్దిగా కోపం గొంతు పెట్టాను.

"ఎంత అపేక్ష అయినా ఉండనీ! అంత చాదస్తం పనికిరాదు సుమా! మగవాడికి భార్య సమస్తమూ కావటానికి వీలులేదు. మగవాడికాలం మూడు వంతులు బయటా ఒకవంతు ఇంట్లోనూ గడుస్తుంది. కాలం యావత్తూ ఇంట్లో గడవటం వల్లా, పురుషుల్లో ఎక్కువ తిరగకపోవటం వల్ల మగవాడు చవట అయిపోతాడు. లేకపోతే కీచకుడు భీముడి చేతుల్లో చచ్చునా? ఇటువంటివన్నీ అలవాట్లు. మనోనిగ్రహం చేత వశంకానిది లేదు. ఇప్పుడు నీకు నీ భార్యయందు గల ప్రేమ ఆడతనంతో కూడుకున్నది. దానికి నిగ్రహం తోడవుతేగాని రాణించదు. నీ భార్య నిన్నీ విధంగా ప్రేమిస్తే దానిలో తప్పులేదు. అది స్త్రీ సహజమైనది. దానిలో పురుషార్థం లేదు. తెలిసిందా?"

బాబు తలవంచుకుని నే చెప్పినదంతా శ్రద్ధగా విన్నాడు. వాడీ విధంగా నాయందు భయభక్తులు తెచ్చిపెట్టుకుంటే చూసినప్పుడల్లా ప్రేమ కూడా తెచ్చి పెట్టుకున్నదేనా అని ఒక్కక్షణం అనుమానం కలుగుతూంటుంది నాకు!

"నాకు కొంచెం టూరింగుపని తగిలింది, బాబాయి!" అన్నాడు బాబు మెల్లిగా. అప్పుడే చివాట్లు తిన్నవాడి గొంతుతో! "నేనెల్లుండి వెళ్ళిపోవాలి. ఒక నెలరోజులు పని ఉంటుంది. దాన్ని రేపు తెచ్చి ఇక్కడ విడిచిపోతాను."

"మంచిది."

## 2

కమలం చాలా బుద్ధిమంతురాలు. "ముగ్ధ" అంటారు చూడండి! ఆ జాతిది. ముగ్ధలయందున్న విశేషం ఏమిటంటే ఇతర స్త్రీల కన్న అబలలుగా కనిపిస్తారు. చూసినవారికల్లా దగ్గిర తీసి సంరక్షించాలనిపిస్తుంది. కొంతమంది ఆడవాళ్ళను చూస్తే ఈ భావం ఎంత మాత్రం కలగదని చెప్పనవసరం లేదు!

బాబు కమలాన్ని వెయ్యి కళ్ళ కనిపెట్టి ఉన్నాడంటే ఆశ్చర్యం ఏమిటి? అది మా ఇంట అడుగు పెట్టిన క్షణం నించీ దాని సౌకర్యం నేను స్వయంగా కనుక్కుంటూ వచ్చాను. బాబు టూరింగు మీద వెళ్ళిపోయినాడు.

రెండు మూడు రోజులు గడిచింది. ఒకరోజు రాత్రి నా భార్య కమలానికి శరీరంలో సరిగాలేదని చెప్పింది. నా కమితదిగులు పుట్టింది. బాబుకన్న నాకెక్కువ అనుభవం ఉండి ఏం ప్రయోజనం, నేను కూడా వాడి మోస్తరుగా ప్రవర్తిస్తే? "ఫర్వాలేదులే! రేపు తగ్గిపోతుంది" అన్నాను నా భార్యతో.

మర్నాటికి తగ్గలేదు. నా భార్య నాతో తిరిగి దాని శరీరం సంగతి ఎత్తింది. లక్షణాలు కనుక్కున్నాను. సరిగా భోజనం చెయ్యదట. పరధ్యానంగా ఉంటూ వచ్చింది. "బాబుకోసం దిగులు పడ్డదేమో!" అన్నాను. ఆలోచించినకొద్దీ ఈ కారణం చాలా సమంజసంగా కనిపించింది.

అయిదోరోజు కమల మంచానపడ్డది. ఆరోజు వాంతులూ, తలనొప్పీ, నూటనాలుగు డిగ్రీల జ్వరమూ మొదలయినై. నాకు కాళ్ళాడలేదు. డాక్టరు వచ్చి చూసి విషజ్వరమన్నాడు. నాలుగు రోజులకిందనే తన్ను పిలవవలసిందన్నాడు. అజాగ్రత్తకు ఫలం అనుభవించాలిసొస్తే తన తప్పేమీ ఉండదన్నాడు. ఏదో మందిచ్చాడు.

నాకారోజు భోజనం రుచించలేదు. కమలం మంచాన పడ్డది – నా అప్రయోజకత్వం వల్ల. ఎందువల్లనో కమలాన్ని భర్తకు తిరిగి వప్పగించలేనని నాకు అధైర్యం కలిగిపోయింది. కావాలని చేతులారచేశాను. బాబు మొహం ఎట్లా చూడటం? అప్పుడు –

ప్రతిరోజూ వాడిదగ్గిరనించి ఉత్తరం వస్తూనే ఉంది. రోజుకో ఊరినించి, ప్రతి ఉత్తరంలోనూ కమలను అడుగుతూనే ఉన్నాడు. ఈరోజు వచ్చిన ఉత్తరం నాకు గుండెనీరయింది. ఒక రోజున్న ఊళ్ళో ఒక రోజుండక పోవడం చేత వాడికి ఉత్తరం రాయటం కష్టం. అసలు చేరకపోదు. రెండురోజులు ఆలస్యం అవుతుంది. కమలం జబ్బు సంగతి రాయాలని కూర్చున్నాను. నాకు చెయ్యి ఆడలేదు; మానేశాను. ఆ రోజు రాత్రి నాకెంతసేపటికీ నిద్రపట్టలేదు. ఎన్నిసార్లో నిద్రపట్టటం, ఏదో చప్పుడై బాబు వచ్చాడని ఉలికిపడి లేవటం జరిగింది. నా శరీరంలో కూడా సరిగా లేదు మొత్తానికి ! కమలం బతకరాదా? నేను పోతాను! ఇంత అధైర్యం నాకెందుకా అన్న ఆలోచన కూడా రాలేదు. కమలం బతకదని నా చెవిలో ఎవరో పదే పదే చెబుతున్నారు!

నాకు కాలమానం లేకుండా పోయింది. పగలు రాత్రి భేదంలేదు. నేనదివరకు చూస్తున్న వస్తువులు కొత్తగా కనిపించటం మొదలుపెట్టినై. ఆ భేదం స్పష్టంగా చెప్పలేను- బహుశా అప్పుడంత శ్రద్ధగా గమనించక పోవటం చేతనేమో? నాకు తెలిసినదల్లా ఒక్కటే విషయం. కమలం కుంగిపోతున్నది. ఇంకా ఇరవై అయిదు రోజుల్లో బాబు వచ్చి భార్యను చూపించమంటాడు! వాడు వచ్చేసరికి నేను కూడా పోయి ఉంటే! అప్పుడు వాడేమవుతాడు?

నా ఆత్మ కమలం పడుకున్న మంచం చుట్టూ తిరుగుతున్నది. లేక నేనే తిరుగుతున్నానో? ఎన్నిసార్లు చూసినా కమలం నిశ్చలంగా కదలకుండా పడుకుని ఉంటుంది. ఒక్కరవ్వ చలనం లేదు. ఇప్పటికే పోయిందేమో? పోతే అందరూ ఎందుకేడవరు? నాతో ఎందుకు చెప్పరు? పిచ్చివాళ్ళు! ఇంకా కనుక్కోలేదు. వాళ్ళు కనుక్కునేవరకూ నేను చెప్పను! నిజం ఎంతకాలం దాగుతుంది?

ఎంతోకాలం దాగలేదు! ఒకసారి నేను కమలాన్ని చూడవచ్చేసరికి కమలం మీద ఒక గుడ్డ కప్పి ఉంది. ఎవరూ ఏడవటం లేదు. నాకెందుకో ఆశ్చర్యంగా లేదు!

బాబుకు రమ్మని టెలిగ్రాం ఇవ్వాలి. ఎవరితోనో చెప్పాను టెలిగ్రాం ఇవ్వమని. ఎన్నో రోజులు గడిచినట్టున్నది నాకు. ఇంకా బాబు రాడేమి? కమలం ఉన్న చోటికి వెళ్ళాను. శవాన్ని తీసేశారు.

ఈ పనులన్నీ, పాపం, ఎవరో నాకు చేసి పెడుతున్నారు. లేకపోతే నేను చేసుకోగలనా? ఎవరిని చూచినా, ఏ వస్తువును చూచినా కళాహీనంగా ఉంది. కమలం పోవటం వల్లనేమో!

బాబు వస్తాడు. నాకు భయంలేదు. జరిగిన సంగతి చెబుతాను. అప్పుడప్పుడు ఎరగని వాళ్ళెవరో వచ్చి నావంక చిత్రంగా చూసి పోతూంటారు. మరి పిచ్చివాణ్ణి చేసేశారు నన్ను. కోపం వస్తే నే మనిషినికాదు!

బాబు వచ్చాడు. ఏమీ మాట్లాడకుండా నాకెదురుగా వచ్చి నిలబడ్డాడు. నావంక ఎందుకట్ల చూస్తాడు? "కమలం ఏది?" అన్నాడు బాబు. ఏది? నేను బలహీనంగా నవ్వాను? "నీకింకా తెలియదా?" అన్నాను. "తెలుసును!" అన్నాడు. "ఇంకేం!" అన్నాను నిర్లక్ష్యంగా.

"కమలాన్ని ఎక్కడోదాచి - పోయిందని చెప్పుతావా?" అన్నాడు బాబు పళ్ళు బిగపట్టి. ఆ మాట ఎందుకో వినడు! చచ్చిపోయింది! చచ్చి! చచ్చి! నేను చెబుతాను కమలం ఏమయిపోయిందో - నన్నడిగితే.

బాబు మాట్లాడకుండా లోపలికి వెళ్ళాడు. వాడడుగుల చప్పుడు వినిపిస్తున్నది - కాస్సేపు హాలులో, కాస్సేపు నా గదిలో; చివరకు కమలం పూర్వం ఉన్న గదిలో చప్పుడాగిపోయింది.

కొంతసేపు నిశ్శబ్దం. తరవాత బాబు ఆ గదిలోనే అటూ ఇటూ పచారు ప్రారంభించాడు. ఎంతసేపటికీ ఆ అడుగులచప్పుడాగదేం? ఒక గంట కాదు! పది గంటలు కాదు! ఎంతసేపాపచారు? నాకు తల తిరుగుతున్నది. ఒక్కసారి "ఆపు!" అని కేకవేశాను బిగ్గరగా. తిరిగి నిశ్శబ్దం.

ఈ నిశ్శబ్దం భరించటం కష్టంగా ఉంది. ఏ చప్పుడూ కాదేమి ప్రారబ్ధం?

అప్పుడప్పుడూ మాటలు వినబడతై. మనిషి కనబడడు. ఎవరో మందంటారు. ఎందుకు మందు? కమలం కాస్తా పోయిం తరవాత? ఎవరా పిచ్చి అనేది? నాకేనా పిచ్చి? వళ్ళు తెలిసి మాట్టాడు.

ఎంతకాలం జరిగిందో తెలియదు. నేను నా గదిలో కూర్చున్నాను. అక్కడికి ఎప్పుడు వచ్చానో ఎట్లా వచ్చానో జ్ఞాపకం లేదు. నా గదికి పడమటగా ఉంది "దాని" గది. ఆ గదిలోనించి నా గదికి వాకిలి ఉంది. నా వాకిలి మెల్లిగా తెరిచి బాబు నా దగ్గిరికి వచ్చాడు.

"బాబాయ్!"

"ఏంరా, బాబూ?"

"ఇప్పుడది ఇటురాలా?"

"ఎవరు?"

"కమలం."

బాబుకు మతిపోయింది. పాపం, మనం తొందరపడరాదు. "నాకు కనపడలేదురా, నాయనా!"

"ఇప్పుడిటువచ్చింది, బాబాయి!"

"ఎక్కడినుంచి?"

"ఆ గదిలోనించి, ఇంతకుముందు నేను నిద్రపోతున్నాను. నేను లేచేసరికి కమలం ఎదురుగా నిలబడ్డది, బాబాయి! నేను పిలిస్తే పలక్కుండా వచ్చేసింది. కమలం నాతో ఎందుకు మాట్లాడదు? బాబాయి!"

"బహుశా! మాట్లాడాలన్నా మాట్లాడలేదేమో?" అన్నాను.

"అంటావా?" అన్నాడు బాబు ఆలోచిస్తూ. "కమలం ఎక్కడుందో చెప్పవూ? నీకన్నీ తెలుసు, బాబాయి! నీకు తెలీనిది లేదు. కమలం ఏది? నీ కప్పచెప్పిపోతినే దాన్ని! దాన్ని వదిలిపెట్టి నేనుండలేనని నీకు తెలీదూ?"

నేను మాట్లాడలేదు. ఏమి మాట్లాడను?

తిరిగి కొంతకాలానికి – మర్నాడుదయమేనేమో! – బాబు నా గదిలోకి వచ్చాడు.

"బాబాయ్!"

"ఊ!"

"కమలం మాట్లాడింది. చాలాసేపు నా దగ్గిర కూర్చుంది. పాపం, నువ్వు దాచావనుకున్నాను. నువ్వు దాచలేదుట. కమలం చెప్పింది. నా దగ్గిరికి వస్తానన్నది, బాబాయి. కొంతకాలం ఆగమన్నది."

బాబు ఈ శుభవార్త నాకు చెప్పి గదిలోకి తిరిగి వెళ్ళిపోయినాడు. ఇట్లా చాలాసార్లయింది. బాబు కమలం బతికివచ్చినట్టే సంతోషించాడు. ఎప్పుడూ కమలం వాడికి కనిపిస్తూనే ఉండేది. ఎవడి పిచ్చి వాడికానందమంటే ఇదే కాబోలు!

ఒకరోజు నేను నా గదిలోనే పడుకున్నాను. నాకు నిద్ర మెలకువ వచ్చేసరికి ఎక్కడో మాటలు వినపడ్డయి. గది ఉత్తరపు వైపు వాకిలి వరండా మీదకి ఉంది. ఆ వాకిలి ఆ సమయంలో ఓరగా తెరిచి ఉంది. నేను చూస్తుండగానే కమలం అటునించి ఇటు వెళ్ళింది వాకిలిముందుగా. నా ఆశ్చర్యం చెప్పటానికి లేదు. వెంటనే లేచి బయటికి పరిగెత్తాను.

దూరంగా మా యింటిముందు చాలామంది – అందరూ అరవవాళ్ళే – కలకలంగా మాట్లాడుతున్నారు. నేను లేవగానే విన్నది వాళ్ళ సందడే! అదుగో ఆ గుంపులో కమలం!

"ఎవరండీ మీరు?" అన్నాను వారి దగ్గిరికిపోయి.

"మాది దచ్చనాది" అన్నాడు గుంపు పెద్ద.

"ఏం పని మీద వచ్చారు?"

"ఈ కుర్రదానికి పెళ్ళి చెయ్యవలా అని ఉండి వచ్చాం" కమలాన్ని చూపించాడాయన. చూసినకొద్దీ ఆయన మొహం ఎరిగిన మొహంగా ఉంది. మనిషిని పోలిన మనిషి ఉంటాడు!

"ఈ పిల్ల ఎవరు?"

"మా పిల్ల!" అన్నాడాయన గర్వంగా.

"ఎవరికిస్తారు?"

"ఎవరు డుడ్డిస్తే వారికి!"

"ఎంత?"

"రెండువేలు రుబా!"

"నేనిస్తాను. నాకిచ్చేసిపొండి."

అరవాయన - ఆయన పుణ్యమా అని - వెంటనే వప్పుకున్నాడు! ఆయన డబ్బు ఆయనకు పారేశాను. ఆయనా ఆయనబలగం వెంటనే నిష్క్రమించారు. కమలం మాత్రం నా పక్కనే నిలబడి ఉంది. దానివంక తిరిగాను. తీరా చూస్తే ఆ పిల్ల కమలం మోస్తరుగా లేదు. ఆ అరవవాడు గారడివాడుగా ఉండాలి! ఏమిటి చిత్రం! నేను చూసినకొద్దీ ఆ పిల్లరూపం మారిపోవటం మొదలుపెట్టింది. చివరకు నా కళ్ళ ఎదుటే అంతర్ధానమయిందా పిల్ల! తరవాత నాకు వళ్ళు తెలియదు!

## 3

నేను తిరిగి మనుష్య ప్రపంచంలో పడేసరికి ఆ అరవాయన మాటలు నా చెవిని పడ్డయి.

"ఇక ఫరవాలేదులెండి!" అంటున్నాడాయన ఎవరితోనో.

నేను కళ్ళు తెరిచి చూశాను. నా మంచం దగ్గిరగా కుర్చీమీద డాక్టరు వరదాచారి అయ్యంగారు కూర్చున్నాడు. దూరంగా ఇంత మొహాలు చేసుకుని నా భార్యా, కమలం నిలబడ్డారు.

"ఓహో, కామేశ్వర్రావుగారు! గుడ్ మార్నింగ్! ఎలా ఉంటుంది?"

"బలహీనంగా ఉన్నది" అన్నాను మెల్లిగా.

"ఓ, మరి బలంగా ఉండునేమి? ఎన్నాళ్ళకు కళ్ళు తెరిచినావయ్యా! నువ్వు మొత్తం మీద మంచి అదృష్టవంతుడు!" అన్నాడు డాక్టరు ఉత్సాహంతో. "....నేను వస్తానమ్మా! మళ్ళీ సాయంత్రం వచ్చి చూస్తాను. ఇక ఫరవాలేదు లెండి!.... వస్తానండి, కామేశ్వర్రావుగారు. ఎక్కువగా మాట్లాడకండి. అసలే వొద్దు. తెలిసయిందా?"

డాక్టరు వెళ్ళిపోయిన తరువాత నా భార్య దగ్గిరికివచ్చి మీద చెయ్యివేసి "ఎట్లా ఉంది?" అన్నది జాలిగా.

"ఇప్పుడు హాయిగా ఉంది" అన్నాను.

నాకు నిజంగా హాయిగా ఉందికూడాను! అప్పుడు ఏడు గంటలయిందేమో పొద్దున. ఏ వారమో, ఏ నెలో ఏమీ తెలియదు.

పదిగంటలకు కమలం ఉత్తరం పట్టుకుని నా దగ్గిరికి వచ్చింది.

"ఏమిటమ్మా?" అన్నాను.

"ఇవాళ మీ అబ్బాయి వస్తారు. తిరగటం అయిపోయిందట."

"ఎప్పుడు వస్తాడు?"

"సాయంత్రం ఆరుగంటలకు."

"సరేలే."

అనుకున్న ప్రకారం రాత్రి దీపాలు పెట్టేవేళకు బాబు వచ్చాడు. వచ్చీ రావటంతోనే నా మంచం మీద కూర్చుని, "పాపం ఎంత జబ్బుపడ్డావు, బాబాయి!" అన్నాడు.

"ఇవ్వాళ్ళకు సరిగా పాతికరోజులురా, అబ్బాయి!" అన్నది నా భార్య.

"పాపం ఎట్లా ప్రారంభమయింది?"

"నువ్వు వెళ్ళిన తరువాత కమలం కాస్త జబ్బుపడ్డది. డాక్టరువచ్చి చూసి విషజ్వరమన్నాడు. ఆ రాత్రి మీ బాబాయికీ జ్వరం ప్రారంభమయంది. శరీరం కాగిపోయింది. తెల్లవారేవరకూ మాకు తెలియకపోవలసిందే! కాస్త జ్వరం వస్తే ఆయనకు వెర్రి మాటలు మాట్లాడటం అలవాటు. పైత్య శరీరం! ఆ రాత్రల్లా, కమలం జబ్బు సంగతి కలవరించారు. ఇక దానికి జ్వరం నయం కాదనేనా, దాన్ని నీకు వప్పగించలేమనేనా, జ్వరం దానికి నయమై తనకు రారాదా అనేనా, ఒకటి కాదు! అది మొదలివ్వాళ వరకూ ఆయనకు వళ్ళు తెలియదు. ఈ రెండు మూడు రోజులనించీ పిచ్చిమాట లేమీలేవు. అంతవరకూ ఆయన చేసిన గోలేనా! అంతా చెప్పటానికి ఒక్కరోజు చాలదు."

నేనంతా వింటూ మాట్లాడకుండా ఊరుకున్నాను.

"అయినా ఒకటడుగుతా! అంత వళ్ళు తెలియని జ్వరంలో కూడా దాన్ని గురించి కలవరించేవాడివి నన్నెందుకోప్పడాలి ? బాబాయి! నీవంటివాణ్ణి కాను నేను?" అన్నాడు బాబు నవ్వుతూ.

పిచ్చివాడు! నేను దానికోసం పడ్డ తపనంతా వాడికెట్లా అర్థమౌతుంది?

***మొదటి ముద్రణ : గృహలక్ష్మి, సెప్టెంబర్ 1932***